

హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్టపై బతుకమ్మ ఆడుతున్న మహిళలు



హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్టపై ఏర్పాటు చేసిన బతుకమ్మ విగ్రహాల వద్ద ప్రజాప్రతినిధులు, నాయకులతో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

# ప్రకృతిని దేవతగా కొలిచే సంస్కృతి తెలంగాణది

- బతుకమ్మ, గౌరమ్మల దీవెనలతో హుస్నాబాద్ నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలి
- ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్



హనుమకొండలోని తన స్వగృహంలో బతుకమ్మతో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, డాక్టర్ షమిత దంపతులు

హుస్నాబాద్, అక్టోబర్ 22 : ప్రకృతిని దేవతగా కొలిచే సంస్కృతి కేవలం తెలంగాణ ప్రజలకు మాత్రమే సొంతమని, ఏ రాష్ట్రంలో కూడా ఇలాంటి సంస్కృతి కనబడదని ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ అన్నారు. ఆదివారం హనుమకొండలోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్టపై జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ, గౌరమ్మ, దుర్గామాతల దీవెనలతో హుస్నాబాద్ నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక బతుకమ్మ, దసరా పండుగలను ఘనంగా నిర్వహించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. సమైక్య రాష్ట్రంలో బతుకమ్మ పండుగను నిర్లక్ష్యం చేశారన్నారు. నియోజకవర్గ ప్రజలు బతుకమ్మ, దసరా వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని సూచించారు. ఈ విజయదశమి ప్రజలందరికీ విజయాలను సాధించి పెట్టాలని భవానీమాతను కోరుకున్నట్లు చెప్పారు. వచ్చే విజయదశమి నాటికి గౌరవెల్లి రిజర్వాయర్ ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరందుతుందని తెలిపారు.



హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువుకట్టపై ఏర్పాటు చేసిన బతుకమ్మ విగ్రహాల వద్ద జనం



హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువుకట్టపైకి బతుకమ్మలతో వెళ్తున్న మహిళలు



హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు కట్టపై బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు



గజ్వేల్‌లో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి



గజ్వేల్ : పాండవుల చెరువుపై బతుకమ్మ ఆడుతున్న మహిళలు

# దుబ్బాకలో రఘునందన్‌రావు చేసిందేమీలేదు

దుబ్బాక, అక్టోబర్ 22 : బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు ఓట్ల రాజకీయం తప్ప.. దుబ్బాకలో చేసిందేమీలేదని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అన్నారు. ఆదివారం దుబ్బాకలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ దుబ్బాక మున్సిపల్ అభివృద్ధి తన వల్లే జరిగిందంటూ ఎమ్మెల్యే రఘునందన్‌రావు గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన అభివృద్ధి సమావేశాలకు ఒక్కసారి కూడా రఘునందన్‌రావు హాజరు కాలేదన్నారు. దుబ్బాక పట్టణానికి ఒక్క రూపాయి అభివృద్ధి పనులు చేయలేని అసమర్థ ఎమ్మెల్యేగా రఘునందన్‌రావు చరిత్రలో నిలిచిపోతారని ఎద్దేవా చేశారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడి ప్రత్యేక చొరవతో మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ సహకారంతో కోట్ల రూపాయలతో దుబ్బాక పట్టణాన్ని అభివృద్ధి చేశామన్నారు. దుబ్బాకలో డబుల్ బెడ్‌రూం ఇండ్లు, మోడల్ బస్టాండు, దవాఖాన భవనం, ఐవోసీ భవనం, పట్టణంలో అంతర్గత రోడ్లు, మురుగు కాల్వలు ఇలా ఎన్నో రకాల అభివృద్ధి పనులు చేసుకున్నామన్నారు. ఈ అభివృద్ధి మొత్తం తన వల్లే జరిగిందంటూ రఘునందన్‌రావు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. పట్టణ అభివృద్ధి సమావేశాలకు రాని ఆయనకు అభివృద్ధి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. కేవలం పదవి దాహం తప్ప.. అభివృద్ధిపై ఆలోచనే లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ రఘునందన్‌రావుకు దుబ్బాక ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. దుబ్బాకలో బీఆర్ఎస్ అభ్యర్థి, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలువడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధికి ఢోకా లేదన్నారు. దుబ్బాక గడ్డపై ఎగిరేది గులాబీ జెండానేనని, రాష్ట్రంలో వచ్చేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని తెలిపారు.



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రసమయి

## మృతుల కుటుంబాలకు పరామర్శ

బెజ్జంకి, అక్టోబర్ 22 : మండలంలోని గూడెం, వడ్లూర్ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, నాయకులు లింగాల లక్ష్మణ్, చింతకింది శ్రీనివాస్‌గుప్తా, స్వామి తదితరులు ఉన్నారు.

## బీఆర్ఎస్ విజయం సాధించాలని హోమం



ఆకునూరులో హోమం నిర్వహిస్తున్న ఉల్లెంగల దంపతులు

చేర్యాల, అక్టోబర్ 22 : సీఎం కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించాలని, జనగామ బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో గెలువాలని కోరుతూ ఆదివారం మండలంలోని ఆకునూరు భవానీ రుద్రేశ్వరస్వామి ఆలయంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, ఉల్లెంగల సేవా ట్రస్ట్ చైర్మన్ పద్మాఏకానందం దంపతుల ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి మరోసారి సీఎంగా కేసీఆర్ పగ్గాలు చేపట్టాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు.

## బీఆర్ఎస్‌కే ప్రజల మద్దతు

గజ్వేల్, అక్టోబర్ 22 : బీఆర్ఎస్‌కే ప్రజల మద్దతు ఉందని, మరోసారి కేసీఆర్ ప్రభుత్వాన్ని దీవించేందుకు సిద్ధంగా ఉన్నారని ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తొమ్మిదిన్నరేండ్లలో ప్రజలతోనే సంబంధాలు పెట్టుకొని ప్రభుత్వం ముందుకుసాగిందని, ప్రతి సంక్షేమ పథకం నేరుగా ప్రజలకు అందేలా సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలతోనే సాధ్యమైందన్నారు. ఈసారి ఎన్నికల్లో బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన పథకాల్లో ప్రతిఒక్కరికీ కేసీఆర్ బీమా పథకం, ఇంటింటికీ సన్నబియ్యం పంపిణీ, రైతుబంధు, ఆసరా పింఛన్లు పెంచడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా చేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు.

## 'మల్లన్న' స్థలంలో అక్రమ నిర్మాణం

చేర్యాల, అక్టోబర్ 22 : కొమురవెల్లి శ్రీమల్లికార్జునస్వామి స్థలంలో ఒగ్గు పూజారి అక్రమంగా భవన నిర్మాణం చేపట్టడడంతో ఆలయ ఈవో ఆదివారం నోటీసు జారీ చేశారు. ఆలయంలో ఒగ్గు పూజారిగా పని చేసే వ్యక్తి ఆలయ స్థలంలో ఏడాది క్రితం భవన నిర్మాణం ప్రారంభించారు. ఈ నిర్మాణాన్ని గుర్తించిన ఆలయ వర్గాలు పనులు నిలిపివేశారు. నాటి నుంచి ఎలాంటి పనులు చేపట్టని సదరు ఒగ్గు పూజారి రెండు రోజుల క్రితం భవనానికి స్లాబ్ వేశాడు. ఏడాది క్రితం నిలిపివేసిన భవన నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించి స్లాబ్ వేయడంతో ఆలయ ఈవో బాలాజీ స్పందిస్తూ ఒగ్గు పూజారికి వెంటనే నిర్మాణాన్ని తొలిగించాలని, లేదంటే వృత్తి నుంచి, తొలిగిస్తామని హెచ్చరించారు.

**ప్రకటన**

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచటం ఏమనగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, వేములవాడ శాఖ గారు. శ్రీ మంద పాండు, S/o మల్లయ్య, R/o. H.No. 2-111/2, B.D. కాలనీ, ప్రశాంత్‌నగర్, సిద్దిపేట మండలం & జిల్లా గారికి వ్యాపార నిమిత్తం ఋణ సదుపాయం కల్పించుచున్నారు. ఇట్టి విషయములో తన యొక్క స్వంత ఆస్తి అయిన RCC బిల్డింగ్ H.No. 18-19-27/5a/1 దీని యొక్క విస్తీర్ణం: 60.00 చ.గజాలు, గ్రౌండ్ ఫ్లోర్ Plinth Area: 200.69 Sq.ft, 1st ఫ్లోర్ Plinth Area: 344.00 Sq.fts, ప్రశాంత్ నగర్, సిద్దిపేట్ మండలం మరియు జిల్లా గల దానిని నా క్లయింట్‌కు పై ఋణ విషయములో తనఖాగా పెట్టి పై ఆస్తికి సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు అప్పగించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపనలు కానీ వ్యాజములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 5 దినముల లోగా తగు దస్తావేజులతో నా కార్యాలయమునకు వచ్చి సంప్రదించగలరు. లేనిచో ఎవరికి అభ్యంతరాలు లేవని ధృవీకరించబడును.

తేది: 22-10-2023 స్థలము: సిరిసిల్ల.

ఇట్లు: Sd/- సి.హెచ్. మహేశ్ గౌడ్
న్యాయవాది బి.ఎస్‌సి., ఎల్.ఎల్.బి.,
సిద్దర్థనగర్, సిరిసిల్ల, జి|| రాజన్న సిరిసిల్ల.